క్లుప్తంగా

ముసుగు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్



రాజీవ్ గాంధీ విగ్రహానికి తొలగించిన ముసుగు

తంగళ్లపల్లి: మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసినప్పటికీ తంగళ్లపల్లి అధికారులు విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించలేదని తెలుపుతూ ×కోడ్ ముగిసినా.. ముసుగు తొలగలే₹ అనే శీర్షికతో బుధవారం 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు వెంటనే విగ్రహాలకు తొడిగిన ముసుగులను తొలగించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న వలంటీర్లు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను బుధవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాసర వేణి పర్శరాములు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జాతీయ సేవా పథకం ద్వారా లక్షల మంది వలంటీర్లు సేవలందిస్తున్నారని, సమాజంపై వారికున్న అభిమానం గొప్పదన్నారు. సేవా పథకం ద్వారా విద్యార్థులకు సేవాభావంతో పాటు శ్రమ విలువ తెలుస్తుందన్నారు. దీంతో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విత్తన దుకాణాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏవో భూమిరెడ్డి

వీర్నపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న విత్తన దుకాణాలను వీర్నపల్లి మండల వ్యవసాయ అధికారి చాడ భూమిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న వరి విత్తనాల ప్యాకెట్లను, పురుగు మందులను పరిశీలించి, ప్రతి షాపు వారు నిర్వహిస్తున్న రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని అందుకు కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి షాపులో విత్తనాల ధరలు, స్టాక్‌కు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదులు తీసుకోవాలని రైతులను కోరారు. దుకాణదారులు ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం సిరిసిల్ల సత్యసాయి సేవా మందిరంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సమితి, పౌర సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో స్ఫూర్తిని చాటుతున్న దివ్యాంగులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కమ్యూనిటీ భవనం, ట్రైసైకిళ్లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. దివ్యాంగుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మంగళారపు రాజేందర్, సఖీ సెంటర్ ఇన్‌చార్జి రోజా, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు



ఆగిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం



మినీ స్టేడియం పనులు



ఆగిన మూలవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు

- డబుల్ ఇళ్ల కోసం ఎదురుచూపు
- ఆగుతూ..సాగుతున్న మినీ స్టేడియం పనులు
- బ్రిడ్జి పనులకు అడుగడుగునా ఆటంకాలే

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణం, పట్టణ పరిధిలోని పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో పాటు పనులు ఆగుతూ సాగుతూ నెమ్మదిగా నడుస్తున్నాయని పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పేరుకు మాత్రమే పనులు ప్రారంభించారని పనులు పూర్తి చేయడానికి ఏళ్లు గడుస్తున్న కూడా వాటిని పట్టించుకునే వారు కరువయ్యారని అంటున్నారు. ఈ ప్రభుత్వం అయిన ఈ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన డబుల్ ఇళ్లు

వేములవాడ పట్టణంలోని పేదలు చాలామంది అద్దె ఇళ్లలో నివాసముంటున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలనే ఉద్దేశ్యంతో ఆరేళ్ల క్రితం మొదటి విడతగా ప్రభుత్వం 800 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. అందులో భాగంగా వేములవాడ–సిరిసిల్ల రహదారిని అనుకుని చింతల్‌ఠాణా కాలనీ వద్ద 144 ఇళ్లను ప్రారంభించారు. మిగతా ఇళ్లను నిర్మించేందుకు స్థలం అనుకులంగా లేకపోవడంతో ప్రారంభించలేదు. ప్రారంభించిన ఇళ్లు కూడా రెండు బటామ్ స్లాబ్‌లు వేశారు, మరికొన్ని ఫిల్లర్లు వేసి వదిలివేశారు. ఆ పనులు ఇప్పటి వరకు ముందుకు సాగలేదు. అవి మధ్యలోనే ఆగాయి. నిరుపేదల కల అలాగే మిగిలింది. ఇప్పటికైనా వాటిని పూర్తిచేయాలని నిరుపేదలు కోరుతున్నారు.

నత్తనడకన మినీ స్టేడియం

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ శివారులోని ఐదెకరాల విస్తీర్ణంలో రూ.2.10 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, తాజా మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు చేతులమీదుగా 2014 జూలై 13న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నిర్మాణం పనులు నత్తతో పోటీపడుతున్నాయి. ఏడాది క్రితం వీటీడీఏ నుంచి మరో రూ.5 కోట్లు మంజూరు చేసినా పనుల్లో పురోగతి లేదు. ఇప్పటికైనా పనులు పూర్తిచేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ఆగిన రెండవ బ్రిడ్జి నిర్మాణం

రాజన్న దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. దీంతో వాహనాల రద్దీ పెరగడంతో గతంలో మూలవాగుపై నిర్మించిన పాత బ్రిడ్జి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాంతో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. అందుకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా 2015లో పాత బ్రిడ్జికు ఇరువైపుల రెండు కొత్త బ్రిడ్జిల నిర్మాణంతో పాటు కూడలి ఏర్పాటు సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించారు. రూ.14 కోట్లతో రెండు బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభించారు. దాంతో వీటిలో పడమటి వైపు ఉన్న బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు. మరోవైపు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి ఇప్పటికీ నిర్మాణ దశలో ప్రతి సంవత్సరం ఏదో ఒక ఆటంకం ఏర్పడి వర్షాలకు మూడుసార్లు కూలిపోయింది. ఇప్పటికీ పూర్తికాని బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాకు ఇళ్లు లేదు



నాకు ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నా. అద్దె కట్టేందుకు ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందిస్తామని చెప్పడంతో వాటి కోసం ఎదురుచూశాం. కాని ఇప్పటి వరకు ఇళ్లు ఇచ్చింది లేదు.

– సత్తవ్వ తిప్పాపూర్

మినీ స్టేడియం పనులు పూర్తి చేయాలి



మినీ స్టేడియం పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, పనులు మాత్రం పూర్తికావడం లేదు. అందుబాటులో స్టేడియం లేక ప్రాక్టీస్‌కు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు పట్టించుకొని పనులు త్వరగా పూర్తిచేయాలి.

– శ్రీకాంత్, క్రికెట్ క్రీడాకారుడు

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



మూలవాగుపై పాత బ్రిడ్జికు ఇరువైపుల రెండు కొత్త బ్రిడ్జిలను ప్రారంభించారు. ఒకటి పూర్తయినా మరొకటి ఇప్పటి వరకు పూర్తికాలేదు. అధికారులు పట్టించుకుని ఆ రెండవ బ్రిడ్జిని కూడా పూర్తిచేయాలి.

– సాయి, వేములవాడ

అంబేడ్కర్‌కు నివాళి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు



గంభీరావుపేట: పూలమాలలు వేస్తున్న నాయకులు



తంగళ్లపల్లిలో..



ముస్తాబాద్‌లో..



వేములవాడరూరల్: శాత్రాజుపల్లిలో..



ఇల్లంతకుంటలో..



బోయినపల్లిలో..



రుద్రంగిలో..



చందుర్తిలో..



సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు



చందుర్తిలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేస్తున్న రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత

చందుర్తి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ ఎన్నికైన సందర్భంగా మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ బస్టాండ్ వద్ద పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జెడ్పీటీసీ నాగం కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, కార్యదర్శి ఇందూరి మధు, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు ముస్కు పద్మ, మాజీ జెడ్పీటీసీ పొద్దుపొడుపు లింగారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు అంచా రాంరెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, నాయకులు పులి సత్తయ్య, దారం చంద్రం, బాలకృష్ణారెడ్డి, దూది శ్రీనివాస్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, యేసుదాసు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో సర్పంచ్ తర్రె ప్రభలత ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

గంభీరావుపేట: మండలంలోని మల్లుపల్లిలో యూత్ కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠి రాజు, నాయకులు కిషన్, వెంకటేశ్, ప్రసాద్, అరుణ్, తిరుపతి, మహేష్, రఘు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

- నేడు శ్రీ మహంకాళి మహాలక్ష్మీ భూలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



జలాధివాసం నిర్వహిస్తున్న భక్తులు

గంభీరావుపేట: మండల కేంద్రంలో శ్రీ మహంకాళీ మహాలక్ష్మీ భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం చండీహవనం, సామూహిక కుంకుమార్చనలు, ధాన్యాధివాసం, జలాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు ఉత్సవాల నిర్వహణ కోసం విరాళాలు అందించారు. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉరేసుకుని బలవన్మరణం

ఆలేరురూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు శివారులో బుధవారం ఓ వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(40) కుటుంబం కొంతకాలంగా హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసం ఉంటోంది. గత నవంబర్ 27న శ్రీనివాస్ ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో శ్రీనివాస్ భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదుతో మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. పది రోజుల తర్వాత శ్రీనివాస్ ఆలేరు శివారులోని ఆర్‌ఆర్‌ఆర్ రెస్టారెంట్ సమీపంలో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని శ్రీనివాస్ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట శ్రీను తెలిపారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటుతాం

ముస్తాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఓట్లను సాధించామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను బీజేపీ సత్తా చాటుతామని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సొల్ల క్రాంతికుమార్ అన్నారు. మండలంలోని బందనకల్‌లో బుధవారం బీజేపీ శక్తి కేంద్రం సమావేశంలో మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి సర్పంచ్ స్థానాలను సాధించాలన్నారు. బీజేపీ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

నియామకం

కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధిగా పందిర్ల శ్రీనివాస్‌గౌడ్‌ను నియమిస్తూ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి నియామకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసిన కార్యకర్తలందరికి సముచిత గౌరవం దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజల వద్దకు చేర్చాలన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, నర్సయ్యకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

టీఆర్టీఎఫ్ కార్యవర్గం

గంభీరావుపేట: తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ముత్తయ్యగారి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చిట్టంపల్లి బాలకిషన్, ఉపాధ్యక్షులుగా శ్వేతాకుమారి, భాస్కరచారి, జిల్లా కౌన్సిలర్లుగా గంధ్యాడపు శ్రీనివాస్, బానోత్ అర్జున్, సంయుక్త కార్యదర్శిగా శనిగరం మహేశ్, కార్యదర్శులుగా మహేశ్, కొమురయ్య, రాంచంద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బోయన్నగారి నారాయణ, ఎన్నికల పరిశీలకులుగా కృష్ణప్రసాద్‌గౌడ్ వ్యవహరించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



నిర్మాణాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ముస్తాబాద్: ముస్తాబాద్ ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలను తొలగించామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. కాలనీలో ఎలాంటి అనుమతులు, పట్టాలు లేకుండా కొంతమంది గుడిసెలు వేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఎవరికీ పట్టాలు, అనుమతులు ఇవ్వలేదన్నారు. ఎవరు కాలనీలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేయవద్దని కోరారు.

ఉజ్వల గ్యాస్‌కు ఈ కేవైసీ

వేములవాడఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన ప్రతి ఉజ్వల వినియోగదారులు ఈ నెల 31లోపు తమ గ్యాస్ కనెక్షన్‌ను ఈ కేవైసీ, ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలని వేములవాడ భువనేశ్వరీ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కిషోర్‌కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే ఆదిని కలిసిన డీసీసీ కార్యదర్శి

రుద్రంగి: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను బుధవారం డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి హైదరాబాద్‌లోని ఎల్లా హోటల్‌లో కలిసి తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం అందజేసి, శాలువాతో సన్మానించారు.

మృతుల కుటుంబాలకు కేటీఆర్ పరామర్శ



సర్పంచ్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్ సర్పంచ్ మోతె రాజిరెడ్డి తండ్రి వెంకటరాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు బుధవారం పరామర్శించారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన ఆవునూరి దేవయ్య బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేదని మనోవేదనతో గుండెపోటుతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కేటీఆర్ వెంట నాయకులు రాజారాం, సదాశివరెడ్డి, రామానుజాగౌడ్, బాల్యానాయక్ పాల్గొన్నారు.